# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనిది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కధలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్ధాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాల్సితే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

★★★★★

# 10 వ భాగం

## ధ్రువోపాఖ్యానం - 2

ధ్రువుడు ఇంట్లోంచి బయటకి వచ్చేసాడు. “నా మనసులో ఏర్పడిన వ్రణాన్ని (మా పినతల్లి మీద కోపంతో అనడం లేదు) భగవత్సంకీర్తనతో తొలగించుకోవడానికి తపస్సుకి వెళ్తున్నాను” అని దారిలో నారదుడితో చెప్పేడు. నిజంగా ముముక్షత్వం రాజుకుని ఉంటే అదే దారిలో కొనసాగుతాడు లేకపోతే మనలాగే ఈ సంసారంలో ఈదవల్సిందే.

నారదుడు అంటే ఆదిగురువు కింద లెక్క. వాల్మీకికీ, వ్యాసుడికీ కూడా సరైన మార్గ నిర్దేశం చేసినవాడాయన. గురువిచ్చే మంత్రం ఒక బీజం. అది మన మనసులో నాటబడుతుంది. మనం మారే కొద్దీ అది ఎదిగి మహా వృక్షంలాగా అవుతూ ఉంటుంది. గురువంటే చీకటిని పోగొట్టేవాడు. చీకటంటే అజ్ఞానాంధరామే.

సరే ఈ వాదోపవాదాలు అయ్యేక ధ్రువుడి పట్టుదల తెల్సింది నారదుడికి. ఇప్పుడు ముందు చేయవల్సింది చెప్తున్నాడు.

క. వర యమునానదితటమునఁ

హరి సాన్నిధ్యంబు శుచియు నతిపుణ్యమునై

పరఁగిన మధువనమునకును

సరసగుణా! చనుము మేలు సమకుఱు నచటన్. [4-246]

యమునా నదీతీరంలో హరి గురించి తపస్సు చేయి. నీకు మేలు జరుతుంది. ధ్రువుడు ఐదేళ్ళవాడు. మనస్సు పరిశుభ్రంగా ఉంది. ఈ దశలో, అమ్మా నాన్నలు చెప్పేది వేదం అనుకుంటూ ఉంటాడు కదా? అమ్మ చెప్పింది శ్రీహరి గురించి తపస్సు చేయి అని. దారిలో నారదుడు కూడా చెప్తున్నాడు. ఇంక ఇది నిజం అనేదానికి తిరుగులేదు అనే భావం ధ్రుడపడిపోయింది. టాల్ స్టాయ్ అంటాడు ఓ చోట “It is impossible and absurd to teach a child”, అని. నిజమే కదా? పరిశుభ్రంగా ఉన్న మనసుకి మనం నేర్పేది ఏం ఉంటుంది?

వ. మఱియు బాలుండ వగుటం జేసి వేదాధ్యయనాద్యుచితకర్మానర్హుండవయ్యు నుచితంబులగు కుశాజినంబులం జేసి స్వస్తిక ప్రముఖాస నంబులం గల్పించుకొని త్రివృత్ప్రాణాయామంబులచేతం బ్రాణేంద్రియ మనోమలంబులను చాంచల్య దోషంబులఁ బ్రత్యాహరించి స్థిరం బయిన చిత్తంబున. [4-248]

శిష్యుడేమో చిన్న పిల్లవాడు. మామూలు జనంలాగా కష్టాలకి ఓర్చుకోలేడు. అయితేనేం? అనేకానేక ఆచారాలూ అవీ పాటించక్కర్లేదు అని చెప్తున్నాడు. వేదాధ్యయనం అవీ చేయక్కర్లేదు. సుఖాసనంలో కూర్చుని ప్రాణాయామంతో మనస్సు స్థిరంగా ఉంచి శ్రీహరి మీద ఉంచితే చాలు. మరి ఇప్పుడు శ్రీహరి ఎలా ఉంటాడనే ప్రశ్న వస్తుంది కదా? అదే చెప్తున్నాడు నారదుడు.

సీ. ఆశ్రిత సత్ప్రసాదాభి ముఖుండును

స్నిగ్ధప్రసన్నాననేక్షణుండు

సురుచిర నాసుండు సు భ్రూయుగుండును

సుకపోల తలుఁడును సుందరుండు

హరినీల సంశోభితాంగుండుఁ దరుణుండు

నరుణావలోక నోష్ఠాధరుండుఁ

గరుణాసముద్రుండుఁ బురుషార్థ నిధియును

బ్రణతాశ్రయుండు శోభనకరుండు [4-249]

తే. లలిత శ్రీవత్సలక్షణ లక్షితుండు

సర్వలోక శరణ్యుండు సర్వసాక్షి

పురుష లక్షణ యుక్తుండుఁ బుణ్యశాలి

యసిత మేఘనిభశ్యాముఁ డవ్యయుండు. [4-249.1]

ముందు భగవంతుడి గుణాలు ఎలా ఉంటాయో చెప్తున్నాడు. ఆశ్రితభక్త వత్సలుడు, అపార కరుణాసాగరుడు, పురుషార్థాలకి నిధియైనటువంటివాడు, మేఘవర్ణం కలవాడూను. సరే గుణాలన్నీ ఇవి. మరి రూపం ఎలా ఉంటుందో తెలియాలి కదా ముందు మనసులో ఊహించుకోవడానికి? దాని కోసం మళ్ళీ వివరణ. గురువులు ఇవన్నీ మామూలుగా చెప్పరు కానీ ఇక్కడ శిష్యుడు అయిదేళ్ళ కుర్రవాడు. అందుకని క్లుప్తంగా అవన్నీ చెప్పాడన్నమాట.

సీ. హార కిరీట కేయూర కంకణ ఘన

భూషణుం డాశ్రిత పోషణుండు

లాలిత కాంచీకలాప శోభిత కటి

మండలుం డంచిత కుండలుండు

మహనీయ కౌస్తుభమణి ఘృణిచారు గ్రై

వేయకుం డానంద దాయకుండు

సలలిత ఘన శంఖ చక్ర గదా పద్మ

హస్తుండు భువన ప్రశస్తుఁ డజుఁడు [4-251]

తే. కమ్ర సౌరభ వనమాలికా ధరుండు
హతవిమోహుండు నవ్యపీతాంబరుండు
లలిత కాంచన నూపురాలంకృతుండు
నిరతిశయసద్గుణుఁడు దర్శనీయతముఁడు. [4-251.1]

అదేపనిగా 'ఆశ్రిత పోషణుండు, ఆశ్రిత భక్తవత్సల్తుడు' అని ఎందుకు చెప్తున్నాడంటే, "నువ్వు తపస్సు మొదలు పెట్టాక మధ్యలో మానేస్తావేమో, అలా చేయకూడదు, కొంచెం మనసులో వికారాలు వచ్చినా ఇది గుర్తుపెట్టుకో ఆయన తప్పకుండా కనిపిస్తాడు" అని చెప్పడానికన్నమాట. కిరీట, హార, కేయూర, కంకణ కౌస్తుభాలతో విరాజిల్లుతూ ఉంటాడు. వనమాలికా విరాజితుడు. సలలిత ఘన శంఖ చక్ర గదా పద్మ హస్తుండు. ఇవన్నీ ఉన్నాయనే శ్రీహరి. ఆయన నిరతిశయసద్గుణుఁడు, దర్శనీయతముఁడు. ఇవన్నీ చెప్పేడు కదా ఇప్పుడు మనసులో ఏర్పరుచుకునే రూపాన్ని ధ్యానించే బీజ మంత్రం ఇవ్వాలి.

వ. అయిన పురుషోత్తముఁ బూజించుచు హృదయగతుండును, సానురాగవిలోకనుండును, వరదశ్రేష్ఠుండును నగు నారాయణు నేకాగ్రచిత్తంబునం ధ్యానంబు చేయుచు బరమ నివృత్తి మార్గంబున ధ్యాతుండైన పురుషోత్తముని దివ్యమంగళస్వరూపంబు చిత్తంబునం దగిలిన మరలమగుడ నేరదు; అదియునుం గాక, యే మంత్రంబేని సప్త వాసరంబులు పఠియించిన ఖేచరులం గనుంగొను సామర్థ్యంబు గలుగు; అట్టి ప్రణవయుక్తంబగు ద్వాదశాక్షరకలితంబును దేశకాల విభాగ వేది బుధానుష్ఠితంబును నయిన 'ఓంనమోభగవతేవాసుదేవాయ' యనెడి వాసుదేవ మంత్రంబునం జేసి. [4-253]

నారాయణుణ్ణి ఒకసారి చూస్తే ఇంక మనసు మిగతా విషయాల మీదకి వెనక్కి రాదు. అదీగాక ఏ మంత్రం అయితే ఏడురోజులు పారాయణ చేస్తే ఆకాశంలో కనిపించే ఖేచరీలు కనిపిస్తారో అదే ఈ ద్వాదశాక్షరమంత్రం – 'ఓం నమో భగవతే వాసుదేవాయ', అనేది. ఇప్పుడు మనసులో విరక్తి ఎలా పెంపొందిచుకోవాలీ, పూజా విశేషాలు ఎవరికి సమర్పించాలో చెప్తున్నాడు.

వ. ఉత్తమశ్లోకుండగు పుండరీకాక్షుండు నిజమాయా స్వేచ్ఛావతార చరితంబుల చేత నంచింత్యముగా నెద్దిచేయు నద్ది హృదయగతంబుగా ధ్యానంబు చేయందగు; మఱియుఁ గార్యబుద్ధింజేసి చేయంబడు పూజావిశేషంబులు వాసుదేవమంత్రంబున సర్వేశ్వరునికి సమర్పింపవలయు; ఇట్లు మనోవాక్కాయ కర్మంబులచేత మనోగతంబగునట్లుగా భక్తియుక్తంబు లయిన పూజలచేతఁ బూజింపంబడి, సర్వేశ్వరుండు మాయాభిభూతులు గాక సేవించు పురుషులకు ధర్మాది పురుషార్థంబులలో ననభిమతార్థంబునిచ్చు; విరక్తుం డగువాఁడు నిరంతర భావంబయిన భక్తియోగంబునం జేసి మోక్షంబుకొఱకు భజియించు" నని చెప్పిన విని ధ్రువుండు నారదునకుం బ్రదక్షిణ పూర్వకంబుగా నమస్కరించి మహర్షి జనసేవ్యంబై సకలసిద్ధుల నొసంగుచు భగవత్పాదసరోజాలంకృతంబయిన మధువనంబునకుం జనియె; అంత. [4-256]

అన్నీ చెప్పేక చివరిగా భగవంతుడ్ని ఎందుకు భజించాలో చెప్పేడు ఇందులో, "విరక్తుం డగువాఁడు నిరంతర భావం బయిన భక్తియోగంబునం జేసి మోక్షంబుకొఱకు భజియించు". నేను చెప్పిన వన్నీ విని "శ్రీహరి కనిపించాక మళ్ళీ తుచ్ఛమైన కోరికలు కోరతావేమో సుమా, కనపడ్డాక మోక్షం అడగాలి మరి", అని ముందే చెప్తున్నాడు. ఇప్పుడు ధ్రువుడికి దీక్ష ఇవ్వబడింది. వెంటనే గురువుకి ప్రదక్షిణ, నమస్కారం చేసి మధువనానికి బయల్దేరేడు. ఆ మధువనం ఎటువంటిదంటే – మహర్షి జనసేవ్యంబై సకలసిద్ధుల నొసంగుచు, అంటే

ఎవరికైనాసరే తపస్సు సిద్ధిస్తుంది అక్కడ. మహర్షి జనసేవ్యంబై అని ఎందుకు చెప్తున్నాడంటే సత్సంగం అటువంటిది. శంకర భగవత్పాదుల శ్లోకం దీనినే నిర్ధారిస్తోంది కూడా.

సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

ఇప్పుడు నారదుడి గురించి ఒకసారి ఆలోచించుదాం.

వ్యాసుడు భారతం రాసాడు, వేదాలన్నీ ఆపోసన పట్టి విభజించాడు, పురాణాలూ అన్నీ అయ్యాయి కనీ మనసులో చింత పోవడంలేదు. ఇలా విచారంగా కూర్చుని ఉండగా నారదుడొచ్చాడు. "అయ్యా ఇంత కష్టపడ్డా నా మనసు ఇలా ఉంది ఏమిటి కారణం?" అని అడిగేడు వ్యాసుడు. నారదుడు చెప్పేడుట అప్పుడు, ధర్మ శాస్త్రం అవీ మంచివే చెప్పడానికి కానీ అందులో భగవద్విభూతి లేదు. అందుచేత భాగవతం రాయి. ఒకసారి భగవత్విభూతి గురించి చెప్పగానే నీ మనసులో శంకలన్నీ తొలుగుతాయి" అని. అలాగే వాల్మీకిని మంచి దారిలో పెట్టినాయనా నారదుడే. అందుకే నారదుడు తొలిగురువు. ఆయన్ని అందరూ కొట్టీ తిట్టీ దుర్భాషలాడుతూంటే, తల్లి ఓదార్చేదిట. కానీ ఓ రోజు ఆవిడ పాము కరిచి చనిపోయింది. దానితో నారదుడు, "సరే ఉన్న ఒక్క బంధనమూ తెగిపోయింది. నాకు ఇప్పుడు శ్రీహరే దిక్కు" అని భగవంతుడ్నే ధ్యానం చేస్తూ ఆయనలో కలిసిపోయేడు.

శివానంద సరస్వతుల రెండు సూక్తులు ఇక్కడ చెప్పుకోదగ్గవి.

"For improvement of a person, everybody should kick him aside and abuse him. Then only he will learn how to progress."

"To see the Brahman is to become That."

అంటే బ్రహ్మాన్ని పొందినవాడు బ్రహ్మమే అవుతాడు అనేది కదా చెప్పేది. దీనినే బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి అంటారు (ముండకోపనిషత్). ఈ రెండూ కూడా నారదుడి విషయలోనే కాదు ప్రతి బ్రహ్మ జ్ఞానిలోను నిజం. ముందు వ్యాసంలో ధ్రువుడు తపస్సు ఎలా చేసాడూ దానికి దేవతలందరూ ఎలా స్పందించారనేది చదువుకుందాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS